ఆంధ్రభూమి దినపత్రిక: 21/28-6-1964

# శాంతినివాసం

భారతి హాల్లో కొచ్చేసరికి సీతాపతిగారు వైరాగ్యశతకం ముందేసుకుని చదువుకో సాగారు. ఆయన ప్రక్కగా సోఫా నానుకుని బిక్షాలు కూర్చున్నాడు.

భారతి ఏదో చెప్పాలనుకున్నది. చెప్పలేదు. గడియారం టంగుమని ఎనిమిది గంటలు కొట్టింది. భారతి 'యింకా టైము కాలేదు' అనుకుని వెళ్ళిపోతుంటే సీతాపతిగారు నవ్వారు. తన్ను గురించి కాదు గదా? అని అనుమానపడ్డది భారతి.

జీవంలేని చుట్టముక్కతో సాధకం చేస్తున్నందుక్కాబోలు అవటా అనుకున్నాడు భిక్షాలు.

సీతాపతిగారి బెంగ గమనించలా! సీతాపతిగారి తత్త్వం భారతికి పూర్తిగా ఏనాడో అవగతం చేసుకుంది. ఆమె అంతగా పట్టించుకోలా!

సీతాపతిగారు ఉండుండి గలగలా నవ్వారు, హాలు ప్రతిధ్వనించేలాగా. ఆ నవ్వుతో ఆయనకు గుక్క తిరగనంత పనైంది! ఆయన్నంతగా నవ్వించిన కారణమేమిటో బిక్షాలు, భారతి తెలుసుకోలేకపోయారు.

"యేటి బాబూ! తెగ నవ్వేతుండారు?"

"ఏముందిరా! పుస్తకం చదువుతుంటే ఎందుకో నవ్వొచ్చింది, అంతే!"

జోడు డ్రాయరు మీద పెట్టి నింపాదిగా సోఫాలోకి జారగిలబడి, ఆలోచనా నిమగ్నుల య్యారు సీతాపతిగారు.

"అంత నవ్వతగ్గ విషయమేమిటి నాన్నా?"

భారతి నొకసారి చూసి, "భారతీ! జీవితచరమాంకంలో ప్రవేశించి, దేహంలో జవసత్వా లుడిగి, మనస్సులో కోరికలు ఎండి మ్రోళ్ళయ్యే వేళ వైరాగ్యం కలిగితే ఫలమేమిటి? అని!"

"పశ్చాత్తాపం వల్ల పాపమూ దాని మాలిన్యమూ తొలగుతుందిగా నాన్నా! తన ప్రవర్తన లో గతంలో చేసిన పాప పుణ్యాలను బేరీజు వేసుకుని, తన తప్పులకు, దోషాలకు పశ్చా త్తాపపడి, ఆ అగ్నిలో మనస్సు పుటం చేసినప్పుడు మనిషి నిర్మలుడౌతాడంటారు నాన్నా?"-

భారతి కంఠంలోని ప్రసన్నతా, నిశ్చల భావమూ, గంభీరత్వమూ సీతాపతిగారు గమనిం చారు.

భిక్షాలు వాళ్ళ మాటలు అర్థంగాక కళ్ళప్పగించి కూర్చున్నాడు.

"ఎవరు చెప్పారు. నీకలా!"

సీతాపతిగారి కళ్ళల్లో కించిత్తు అపహాస్యం, సంశయమూ చూసింది భారతి; భిక్షాలు పోర్షను కరువైన నటుడి మల్లే కళ్ళు సగం మూసి మిగతా సగంతో జరుగుతున్న దృశ్యాన్ని చూస్తున్నాడు.

'నీకు తెలియదా నాన్నా!' అని మాత్రం అనగలిగింది భారతి. యింతసేపు తాచెప్ప బోయే దాన్ని గురించే ఆలోచించింది. భారతిని సీతాపతిగారు పసిగట్టారు.

"తెలియక కాదు!" అనేలా నవ్వి, "పశ్చాత్తాపం అంటే జ్ఞాపకం వచ్చింది. ఓ కథ చెప్పమన్నావా?" అని కూతురు వేపు చూసి, "అయితే కూర్చో!" అని, "ఒరేయ్ భిక్షాలు! అలా కూర్చో!" అని "ఒరేయ్ భిక్షాలూ, ఆ కిటికీ తలుపులు మూసెయ్యి, చలిగాలి తోల్తున్నది" అని వాడికి పురమాయింపు అందించారు.

భిక్షాలు ఆదేశం అమలు పరచటానికి వెళ్ళాడు. భారతి మరోసారి గడియారం మొహం చూసి స్వగతం కానట్లు "ఎనిమిదైంది?" అనింది ప్రకాశంగా!

"భోజనానికి వేళైంది గదూ? తెలుసు తల్లీ, వాడు రాలేదు గదా?" అని విచారంగా చూశాడు కూతుర్ని.

"రాలేదు."

"రాడు! నాకు తెలుసు!" ఆ మాటలతోటి పాటే కళ్ళు నీళ్ళు నింపుకున్నాయి. మొహం లో, బాధ ప్రత్యక్షమైంది. భారతి ఆయన మొహంలో ఏర్పడ్డ క్రీనీడను చాలా రోజుల నాడే గుర్తించింది. వాటిని తొలగించాలని యత్నించటం, శుద్ధ మూర్ఖుడు మాత్రమే చేసే తెలివి తక్కువ పనని ఆమె నమ్మిక!

ఆయన సంభాళించుకోలేక పొయ్యాడు, ఆ దుఃఖ స్మృతి నుండి! ఆయనకు రాను రాను అది అసాధ్యమైంది.

భిక్షాలు వచ్చేసరికి, అచేతనంగా సీతాపతి, అశక్తురాలై భారతి కనుపించారు. తెల్లవారి లేచిందగ్గర్నుంచి అలాంటి మూర్తులను చూడటం అతనికి అలవాటై పోయింది.

"వానొచ్చేలా వుంది బాబూ! నడిగేటు వేద్దామంటే అయ్యగారింకా రాలేదు!"

"వస్తాడులే భిక్షాలు!"

భిక్షాలు యధాస్తానం అలంకరించాడు. భారతి చేసేదేమీ లేక. మేడ మీద కెళ్ళింది.

అనాథ ఆర్తనాదంలా గాలి రొదపెట్టి ఏడుస్తూ విశాలమైన గదుల్లో మూగబోతున్నది. పల్చటి సిల్కు తెరలు విధివ్రాత మోస్తరుగా రీతి గతి తప్పి, నృత్యం చేస్తున్నయ్. వచ్చే ప్రళయాన్ని ఎదుర్కోటానికి క్రొత్త బలం సంతరించుకుంటోంది మెర్క్యురీ బల్బు.

భారతికి యివన్నీ ఏ విధంగా వున్నయ్యో అన్నంత తీరిక, ఓపిక లేవు. అంతకన్నా, ఆమె కాధైర్యం లేదంటే బావుంటుందేమో.

ఎక్కడో మెరిసింది. తారురోడ్డు తళుక్కుమంది, అనిత్యమైన ఆనందంలాగ. చేతులు అడ్డంపెట్టుకు పరిగెత్తుతున్నాడు గాలిని దూసుకుంటూ - ఓ అబ్బాయి!

మళ్ళీ మెరుస్తుందేమో చూద్దాము పరిశీలనగా అనుకుంది భారతి! కానీ చూట్టం పడనే లేదు.

ఎవరో పాపం! ఒంటరిగా ఈ చీకట్లో అవస్తపడుతున్నాడు. అమ్మా, నాన్నా ఎవరూ లేరేమో? వుంటే అలా ఎందుకు వదిలిపెడతారు? కాలిన కాగితం లాగైంది, యింతవరకు వెన్నెలలో తెల్లగా వున్న ఆకాశం. అదిగో భిక్షాలు గురకలా ఆకాశం వురుముతోంది. వాన దేవుడ్ని యుద్ధభేరి మ్రోగించి వర్షయాత్ర సాగించమని పురమాయిస్తోంది.

'పాపం ఆ పిల్లవాడు ఎలా యింటి కెడతాడు?'

భారతి క్షణం ఈదురు గాలిలో తాటాకులా చలించింది. ఆమె హృదయం గువగువ లాడింది.

రాగలిగినంత వేగంగా క్రిందకొచ్చి "భిక్షాలు" అని కేకెట్టింది.

భిక్షాలు "ఏటమ్మగారూ!" అని భారతిని చూశాడు, ప్రమాదం జరిగిందేమోనని.

భారతికి మాట తడబడింది. దేహమంతా గజగజలాడుతోంది.

"ఎవరా.... అబ్బాయి.... పాపం చూడు.... వాన.... వెళ్ళు!"

భిక్షాలు తెలుసుకుని, నవ్వి, "ఎంత గాభరా పెట్టారండి అమ్మగారూ! ఏటో అనుకున్నాను?" అని తన చోటుకు పోబొయ్యాడు - అది మామూలు సంగతేనని గ్రహించి.

"భిక్షాలు! నీకు పుణ్యముంటుంది. ఈ ఒక్కసారి వెళ్ళిరావూ నీ కాళ్ళను మ్రొక్కుతాను!.... వెళ్ళు భిక్షాలు! చూడు వాన గూడ వచ్చేలా వుంది!....."

భిక్షాలు కాదనలేకపోయాడు. అలాగని, వెళ్ళలేక పోయినాడు.

బయట జోరున వాన నీళ్ళు అభాగ్యుడి కన్నీళ్ళులా పడుతున్నాయి! ఎలా పొయ్యేది.

తను వెళ్ళిందీ. లేందీ వేయి కళ్ళతో చూస్తు వెనకాల భారతి!

సంశయం సాగనివ్వలా భిక్షాల్ని! వెనుతిరిగాడు.

నిండైన మొహం. బాధకు తట్టుకోలేక మనసు సరిపెట్టుకోలేక, ఏమీ చెయ్యనూ లేక, 'నీవే తప్ప యితః పరం బెరుగ!' అన్నట్లు భారతి!

చూస్తూ వెనక్కు రాలేక; వానలోకే పొయ్యాడు భిక్షాలు!

భిక్షాలు వెళ్ళంగానే గాలి, వానను వెంటేసుకు వచ్చి తివాచీ మీద బోర్లా పడ్డది. ఆకతాయి పిల్లాడికి మల్లె వుండి వుండి వస్తున్న జల్లుకు, వొళ్ళు జలదరించి, గొంతు పెకల్చుకు, "అమ్మాయి! వాన లోపలికి వస్తున్నది!" అన్నారు సీతాపతిగారు.

లేచి వెళ్ళి తలుపులు గడి వేసింది.

"అమ్మా చూశావా! ఏది కావాలని జీవితాంతమూ ఆశిస్తామో, అదే కొరవడుతుంది. కొందరి విషయంలో. యిలా ఎందుకు జరుగుతుందో, ఏమిటో తెలుసుకున్న వాడు

ఒక్కడు వున్నట్టు లేదింత వరకు!"

"యిప్పుడేమైంది నాన్నా!"

"ఏమీ కాలేదు తల్లీ! మన విషయం తల్చుకుంటేనే ఆశ్చర్యమూ, ఆలోచనా కలుగుతాయి ఎప్పటికైనా మనం మామూలు మనుషుల్లాగా బ్రతగ్గలమంటావా?"

"అదంతా మనలో వుంది నాన్నా! ఎవరి జీవితానికెవరు కర్తలు చెప్పు?'

"నిజమే కావచ్చు! అలాగని, ఎవరూ కావాలని నరకాన్నీ, అనుక్షణమూ అనుభవించినా తీరని దుఃఖాన్నీ కోరుకోరుగా?"

"కోరుకునేవాళ్ళు లేరంటావా?"

"నాకు నమ్మకం లేదు?" - ఆ తర్వాత ఆలోచనా కలిగింది. ఆయనలో. భారతి ఆయన ఉబ్బిన మొహం వేపే చూస్తున్నది.

కుక్క అరవటం, ఆ తర్వాత తలుపు చప్పుడు వినపడింది. భారతి లేచి వెళ్ళి తలుపు తెరవంగానే భిక్షాలూ, అతని వెంట వాన, చీంబోతు లాంటి కుక్క, లోపలికొచ్చారు.

"తలుపెయ్యండమ్మగారు, తలుపెయ్యండి, చలేస్తోంది-"

భారతి తలుపేసింది, కుక్క ఒక్కసారి ఒళ్ళు విదిలించుకుని, పడుకుండే ప్రయత్నంలో వుంది.

"ఆ అబ్బాయేడీ?"

"మీ చాదస్తం మీదమ్మగారూ! ఆడెవ్వరూ లేరు. వెతకలేక చచ్చాను, కుండపోతగా వాన! అయ్యగారియ్యాళ రారేమో అమ్మగారూ!"

"సర్లే! వెళ్ళి గుడ్డలు మార్చుకో?"

భారతికి, భిక్షాలు సరిగా వెతకలేదేమో! వెతికితే, ఎందుకు దొరకడు? వీడు అసలే అలశ్యం మనిషి. జోగుకుంటూ వెళ్ళేసరికి ఎటో పోయింటాడు. అసలు ఆ పిల్లవాడు-

గుండెలో బరువుగా ఏదో పడ్డట్లయింది. ఆ మాట తల్చుకునేసరికి, భారతికి,

చా! ఈ మాత్రం వానకే ప్రాణాలు పొయ్యుంటాయ్యా? ఏమో?

అలాగని దీర్ఘంగా ఆలోచించుకోలేకపోయింది.

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు?"

సీతాపతిగారి ప్రశ్నతో, భారతి ఉలిక్కిపడి, "ఆ అబ్బాయి నాన్నా" అనంది!

"చూడు భారతీ, ప్రతి విషయానికీ బాధపడి చెయ్యగలిగిందేముంది! నిత్యం చచ్చేవాడికి ఏడ్చేవాడెవడు? అదీగాక, కొన్నాళ్ళకు బాధలు భరించి, భరించి, హృదయం రాయిలా గౌతుందంటారు. కానీ నీ విషయంలో మాత్రం!" - భారతి మొహం చూస్తూ మిగతా మాటలు మ్రింగేశారు.

క్షణం నిశ్శబ్దం చోటు చేసుకుంది వారి మధ్య.

భిక్షాలు గుడ్డలు మార్చుకుని వచ్చి, "అమ్మగారూ రాజమ్మగారు వెల్తారంట, మీ

భోజనాల సంగతి అడగమంటున్నారు!" అని చెప్పాడు.

కళ్ళు ఒత్తుకుని, "వెళ్ళమను వాన వెలిసిందిలా వుంది. మేం కాసేపు ఆగి భోజనం చేస్తాములే!"అని భారతి చెప్పింది.

"అన్నయ్య రోజు రోజుకీ మారిపోతున్నాడు నాన్నా! అన్నయ్యను చూస్తుంటే భయమూ, జాలీ కలుగుతున్నాయి. కానీ నే చేయగలిగిందేముంది? కోపంగా చూస్తాడు! తను వేసిన తప్పటడుగు గురించి చెబుదామంటే గుండె ధైర్యం చాలటం లేదు"- ఆమె విలవిల్లాడింది. అందులో ఆమె అశక్తత, అన్నయ్య చెయ్యి జారిపోతున్నాడే అన్న బాధా కనిపిస్తున్నాయి.

సీతాపతిగారు మాట్లాడలేదు. నిశ్చలంగా ఎటో చూస్తున్నారు. ఆ చూపు వెంట నైరాశ్యము, నిశ్చితమైన ఆలోచన వున్నాయి.

"నువ్వే వాణ్ణి, వాడి జీవితాన్నీ నాశనం చేశావు నాన్నా!"

సీతాపతిగారికి భారతి మాటల్లోని నింద, ఆరోపణ అర్థమయ్యాయి!

"ఆ విషయంలోనే ఒక నిర్ణయానికి రాలేకపోతున్నా భారతీ! నా తప్పును అంగీకరించటంలో నేను భయపడుతున్నా! ఎంత ప్రయత్నించినా ఆ భయం నన్ను వీడటం లేదు!"

"జరగాల్సిందంతా జరిగిపోయింతరువాత యింకా ఏమైతే ఏం నాన్నా! మొదటి నుంచీ వాడికిచ్చిన చనువు నీ నోరు కట్టేసింది. యామిని వ్యక్తిత్వాన్ని శంకించింది నీకు తెలుసు, ఆమెను చాలా రోజులు హింసించింది నీకు తెలుసు! అయినా నీవు ఒక్క మాట గూడ మాట్లాడలేదు. మానానికీ, అభిమానానికీ, మాటకి ద్రగ్గి, చివరకు...."

"భారతీ...." అని ఆయన బాధగా మూలిగి, "ఆ నేరం మాత్రం నేను చెయ్యలేదు" అని అన్నారు.

"మనుషుల్ని మోసం చెయ్యగలంగానీ మనసుని మోసం చెయ్యలేం నాన్నా!"

"అంటే నేనే ఆ నేరం చేశానంటావా?"

"అనను. కానీ దాని భాగం నీకుంది. దానికి ముఖ్య కారకుడివి నువ్వు!"

"నేనా!?"

"ఆఁ! అన్నీ తెలిసి నువ్వు నిరామయంగా వూరుకున్నావు. ఆ అర్ధరాత్రి యామినిని షికారు నెపం మీద తీసుకు వెళ్ళటం, నువ్వు చూశావు. యిదేమిటని అడగలా! యామిని రాలేనంటే, బలవంతాన అన్నయ్య వెంటబెట్టుకెళ్ళాడు, నిండు గర్భిణి! వెంట వెళ్ళింది. అన్నయ్య భర్త గాబట్టి! కానీ మనిషైనవాడెవడు చెయ్యని పాపం ఆ అర్ధరాత్రి అన్నయ్య గావించాడు!"

భారతి, పొంగివస్తున్న ఉద్రేకాన్ని ఆపుకుంది. ఒకసారి తండ్రి వేపు చూసింది.

"కారు ప్రమాదంలో"-

ఆయన గొణుక్కోవడం విన్నది.

"అదంతా కల్పన? అన్నయ్య అలా నటించాడు. ఒక మనిషి ప్రాణం తియ్యటం

చేతనైన మనిషికి ఆ నేరం కప్పిపుచ్చుకునే తెలివీ సహజంగానే వుంటుంది. ఆ తెలివిలేంది అంత సాహసానికి పూనుకోడు. అన్నయ్య చేసిన ఆ ఘోర నేరాన్ని నీవు కప్పిపుచ్చావు- నీ తెలివీ, పలుకుబడీ, ధనాన్ని చూపి. బుద్ధిరిగినవాడెవడు, యామిని కారు ప్రమాదంలో చనిపోయిందని అనుకోడు!"

సీతాపతిగారి కళ్ళు ఆర్ద్రమైనాయి. ఆయన వాలకం చూసి భారతి యిహ మాట్లాడలేక పోయింది.

"అన్నీ త్రవ్వుకుంటే మన కన్ను మనం పొడుచుకున్నట్లవుతుంది. కానీ నా మనసు ఎందుకో స్వస్థత తప్పిపోతున్నది!" - భారతి విలవిల్లాడింది.

సీతాపతిగారు శోక సముద్రం నుంచి తేరుకుని, "మీ అందరి జీవితాలు పాడు చేసింది నేనే! నిజమేనమ్మా నేను ద్రోహిని. కానీ నాకు శిక్ష విధించటం మాత్రం సరైన పద్ధతిలో జరుగలేదు" అని అన్నారు!

భిక్షాలుకు నిద్ర మీద పడుతున్నది పిశాచం లాగ! వీళ్ళ ఏడుపులు చూసి వచ్చే నిద్ర సంశయిస్తున్నది యిది సమయం కాదేమోనని!

"లేవండమ్మాయిగారూ! వాన యిప్పుడప్పుడే వెలిసేటట్లు లేదు. అయ్యగారు ఈ పూటకు రారు" అని ఆవలించాడు.

భారతి "లే నాన్నా!" అని లోపలి కెళ్ళింది!

భారతి బాత్‌రూంకెళ్ళి మొహం కడుక్కుంది చల్లని నీళ్ళతో! మనస్సు తిరిగి కుదుట పడసాగింది. వంటగదిలో లైటు వేసి ఆ వెలుతుర్లో భోజన సామగ్రి, అన్నీ చూసి, టేబుల్ మీద, భోజనానికి ఏర్పాట్లు చేస్తుండగా ఓ క్రొత్త గొంతుక వినపడ్డది హాల్లోంచి.

"నా పేరు వేణు అండి! యిక్కడ తెలిసినవాళ్ళెవరూ లేరు. ఈ రాత్రి కుండి తెల్లారేక వెడతాను, ఏమంటారు?"

సీతాపతిగారు ఏం సమాధానం చెప్పలా. ప్రొద్దుపోయింది, యిక్కడ ఆశ్రయం లేదంటే యీ వానలో చీకట్లో ఎక్కడికి వెళ్ళగలడు?

"వీల్లేదు వెళ్ళవయ్యా. నీ నక్క వినయాలు చాలులే!?"- భిక్షాలు కాచి దేర్చిన అనుభవం కలవాడిమల్లె కసురుకున్నాడు.

వేణు యింకా ఆశ వుందేమోనని, సీతాపతిగారి పాలిపోయిన మొహంలోకి ఆశగా చూస్తున్నాడు.

సీతాపతిగారు ఏం మాట్లాడలా! వేణు తడిసిన గుడ్డల్ని, నీళ్ళు కారుతున్న జుత్తును చూసుకుని వెనక్కు తిరిగాడు. రెండడుగులు గూడ వేశాడు కానీ ఆర్ద్రమూ, తియ్యటి మాట వినపడి, కొండెక్కిన ఆశ మొలకెత్తి వెనక్కు తిరిగాడు!

"చూడబ్బాయ్! వాళ్ళ మాటలకేంగానీ, వుండిపో!" అని, "ఏం నాన్నా! ఏమంటావు? ఈ సమయంలో మరెక్కడకు వెళ్తాడు?" అని తండ్రిని చూస్తూ అన్నది భారతి.

సీతాపతిగారు మాట్లాడక వూరుకోవటం భిక్షాలు కేమాత్రం నచ్చలా; పడుకున్నవాడల్లా, లేచి, "ఏందమ్మగారూ మరీనూ? వీళ్ళ సంగతి మీకు తెలియదు. సూదుల్లా వచ్చి, మేకుల్లాగై, ఓ అర్ధరాత్రి అందినది పుచ్చుకు చెప్పకుండా పోతారు. ఆ తర్వాత మీ యిష్టం" అని వేణుని కోపంగా చూశాడు.

భారతి వేణు మొహం చూస్తు వూరుకోలేక, "చూడు భిక్షాలు. యింత చిన్న కుర్రాడు దొంగతనాలు చేస్తాడంటావా? మనుషుల్ని మనుషులే నమ్మకపోతే, యింక ఎలా? నిండా పదహారేళ్ళు గూడా లేవే. అతణ్ణి అలా అనటానికి నోరెలా వచ్చింది? నీ బిడ్డలాంటి వాడని ఆలోచించు, నువ్వా మాట అనగలుగుతావేమో?" అనంది.

భిక్షాలు నాలిక మడతబడ్డది మాట రాక. ఓడిపోయానన్న కసికొద్దీ చటుక్కున పడుకుని, "అంతా తలకాయలేని మడుసులే, ఖర్మ" అని గొణుక్కుని, కళ్ళు మూసుకున్నాడు.

"చూడబ్బాయ్! ఆ చొక్కా లాగూ విడిచెయ్, నేను పొడిగుడ్డలిస్తా కట్టుకో" అని వేణు మాట వినకుండా లోపలికెళ్ళి అన్నయ్య లుంగీ, బనీను తెచ్చింది.

అతను లాగు విప్పటానికి సిగ్గుపడడం గ్రహించి, "యివో యివ్వి కట్టుకో! యింతలో భోజనం వడ్డిస్తాను!" అని తెచ్చిన గుడ్డలు, అక్కడ పెట్టి వెళ్ళింది.

వేణుకు, అంతా ఆశ్చర్యము ఆనందమూ కలిగింది. ఆ వెంటనే తన లక్ష్యము మర్చిపోలేదు.

తండ్రికి భోజనం వడ్డించి, వేణు కోసం వచ్చిన భారతి కళ్ళు అప్రయత్నంగా, వేణు వీపు మీది పుట్టుమచ్చమీది కెళ్ళాయ్, ఆశ్చర్యంతో, విప్పారి సంశయంలో ఆగినయ్! భారతి చూపు చక్కలిగింతలు పెట్టగా, "ఏంటమ్మా చూస్తున్నారు" అని అడిగాడు.

"ఏమీ లేదు... త్వరగా రా!" అని భారతి వెళ్ళి, "నాన్నా" అని పిలిచి, అంతలోనే వేణు రావటం లేదని, తెలుసుకొని "తమ్ముడికి వీపు మీద పుట్టు మచ్చ వుండేది గదూ నాన్నా!" అని ప్రశ్నించింది.

సీతాపతిగారు ఎత్తిన ముద్ద దించి బొమ్మలు ముడిచి, "యిప్పుడా అనుమానం ఎందుకొచ్చిందమ్మా!" అని అడిగారు.

"ఏమీ లేదులే నాన్నా. వుందా లేదా చెప్పు."

"వుంది."

"ఎడమభుజం మీదా, కుడిభుజం మీద?"

ఆలోచనగా భారతి వేపు చూసి, "యిప్పుడే మొచ్చిందని అడుగుతున్నావమ్మా?" అని క్షణం ఆగి, "చూడు భారతీ, నా విషయం తెలుసు కదూ, శాంతి తాలూకు ప్రస్తావన భోజనం వేళ తీసుకురావొద్దని చెప్పాను గదమ్మా!" అని, నీళ్ళు నిండిన కళ్ళను క్షణం మూసుకుని భోజనం ముందు నుంచి లేచారు.

భారతికి. తండ్రి తింటూ వున్న భోజనం మీద నుంచి లేవటం బాధ కలిగించి,

"నాన్నా! లేవకు నాన్నా. తప్పే నాది. నాన్నా నా మీద ఒట్టే నువ్వు లేస్తే" అని గద్గద మైన గొంతుతో పిలిచింది. కాని ఫలితం మాత్రం లేకపోవడంతో దుఃఖాన్నీ, బాధను బల వంతాన మ్రింగి, "యింక నే బ్రతికి లాభం ఏమిటి నాన్నా? ఏది చెయ్యగూడదో అదే తప్పిదాన్ని చేసి నీకు శాంతి, సౌఖ్యమూ లేకుండా చేస్తున్నాను" అని బావురుమంది.

వేణు కిదేం అర్థం గాలా! తన విషయంలో గొడవపడుతున్నారేమోనని అనుమానం వేసింది.

భారతి, వేణుని చూసి, "రా! బాబూ! రా. యిలా కూర్చో" అని పిల్చేసరికి, అనుమానం తీరి వడ్డించిన పళ్ళెం ముందు కూర్చుని నిశ్శబ్దంగా భోజనానికుపక్రమించాడు.

భారతి పాలు తీసుకువెళ్లింది. వేణు భోజనం చేస్తూనే, ప్రక్క గదిలోంచి వినపడుతున్న సంభాషణ వింటున్నాడు.

"పాలు తీసుకోనాన్నా!"

"యిప్పుడేమీ వద్దు, మనసు బాగాలేదమ్మా!"

"నే తెలియక చేసిన తప్పుకు, నువ్వు శిక్ష అనుభవించటం న్యాయంగాదు నాన్నా! అలా నువ్వు శిక్ష అనుభవిస్తూ నాకెందుకింక మరింత శిక్ష, క్షోభ పెడతావు.... తీసుకోవా నాన్నా పాలు!"

వేణు అన్నం గూడా తినటం మానివేసి మాటలు ఆలకిస్తున్నాడు.

"చేసిన అపరాధాలకే క్రుంగి, కృశించి నీరసించి పోతున్నా! మళ్ళీ తప్పు చేసి, యిప్పటికే కొఱవైన నీ సుఖాన్నీ, స్థైర్యాన్నీ నాశనం చెయ్యనమ్మా..... తే! పాలివ్వు!.... కానీ చూడు భారతీ, ఈ పాలు త్రాగటం గూడా యిప్పుడు నాకు శిక్ష అని మాత్రం గ్రహించు!"

ఆ తర్వాత భారతి, కళ్ళు తుడుచుకొని రావడం చూసి, తలొంచుకు భోజనం చేయసాగాడు వేణు.

"ఏం కావాలి బాబూ"- వేణు తల ఆప్యాయంగా నిమురుతూ అడిగింది.

ఆ ఆదరణకూ, చల్లని మాటలకు, బీటలు వారిన హృదయం వాన చినుకులు పడ్డట్లయి వేణు, "ఏమి అక్కరలేదు" అన్నాడు జీరబోయిన గొంతుకతో!

క్షణకాలం చూపులు కలిసి, ఏదో భావం మెరిసి, కనురెప్పలు క్రిందకు వాలినయ్ ఆలోచనా పూరితంగా!

"అమ్మా, నాన్నా వున్నారా బాబూ"

"అమ్మ లేదు! నాన్న సంగతి తెలియదు!"

"తోడబుట్టినవాళ్ళు, అయినవాళ్ళు ఎవరూ లేరా?"

"తోడబుట్టినవాళ్ళు మాత్రం లేరు. అయినవాళ్ళు వున్నారు."

'పాపం' అనుకుంది భారతి. ఆమెది సహజంగా, దయార్ద్ర హృదయం! అనుభవించిన కష్టాలూ, తీరని కోరికలూ ఆమెను బేలను చేసినయ్, చిరుగాలికి అల్లల్లాడే చిగురుటాకు

లాంటిది ఆమె హృదయం, బాధకూ, సంతోషానికి, తట్టుకోలేక యిప్పుడో మరుక్షణమో బ్రద్ధలై, చినిగి వాలికలై పొయ్యేంత స్థితికి దిగజారింది.

"ఆయన మీ నాన్నగారా?"

వేణు మాటలకు ఉలిక్కిపడి, "ఏమిటన్నావు?.... అవును మా నాన్నే!" అని, "మాటల్లో నీ సంగతే మర్చేపొయ్యాను. ఏమన్నా కావాలా?" అని అడిగింది.

"ఏమీ అఖ్ఖరలేదు!" లేచి వెళ్ళి చెయ్యి కడుక్కుని, వచ్చి, "మిమ్మల్ని చూస్తుంటే, మా అమ్మ జ్ఞాపకం వస్తున్నది. కానీ అమ్మను నే నెరగను!"

వేణు కళ్ళు చెమ్మగిల్లటం భారతి చూసింది, ఆమెకూ, ఏదో అర్థమైన భావం కలిగింది.

"మా అమ్మ, నాకు ఊహ రాకముందే చనిపోయింది" బలవంతంగా వేణు వస్తున్న దుఃఖాన్ని పరిమితం చేసుకున్నాడు.

ఆర్తులు తామే కాక యింకా వున్నారన్న సంగతి తెలుసుకుంది భారతి.

"మీ అమ్మ ఆత్యహత్య చేసుకుందా?"

"అవును!"

"ఎందుకు?"

"తెలియదు!"

కానీ వేణుకు తెలుసు, ఆ సంగతి వేణు మీద జాలి పెరగజొచ్చింది భారతికి.

భారతి లైటు ఆర్పేసి, "పద పడుకుందువుగాని" అని హాలులోకి వెళ్తుంటే, వేణు వెనకగా వస్తూ, "మీరు భోంచెయ్యరా?" అని అడిగాడు.

"ఊహూ!" ముక్తసరిగా సమాధానం చెప్పి, మడిచివున్న మడత మంచం వాల్చి జంపుఖానా దుప్పటి, దిండు వేసి, "యిక్కడ పడుకో!" అని వెళ్ళింది.

వేణు హాలంతా ఓసారి చూశాడు. భిక్షాలు తూర్పువేపు కిటికీ క్రింద పడుకోనున్నాడు. అతనికి కొంచెం క్రిందుగా నల్లగా, బొద్దుగా వున్న కుక్క, ముడుచుకు పడుకొని వున్నది. సోఫాల మీద, డ్రాయర్ల మీద, విలువైన సామాన్ల మీద బల్బు కాంతి ప్రాకుతూంది. హాలుకు మధ్యలో ఓ స్త్రీ పటం వ్రేల్లాడదీసి, పూలమాల వేసి వుంది, మిగతా ఫొటోలన్నీ ఒక కాలేజీ విద్యార్థి జీవితాన్ని చూపేవి. అతని విలాసములను సాక్షాత్కరింపచేసేవీనూ!

భారతి ప్రక్క గుడ్డలు మీద వేసుకు వచ్చి, "చూడు వేణూ, ఏమన్నా కావాలంటే పిలు! మేడ మీద వుంటాను" అని మెట్లెక్కి మేడమీద కెళ్ళింది. ఆమె వెళ్ళిన వేపు చూసి, భారంగా నిట్టూర్చి, వెలుగుతున్న బల్బు వేపు చూశాడు. తన పనికి యిది అడ్డంకిగా తోచింది అతనికి. అలా చూచిన వెంటనే, మంచం దిగి లైటు ఆర్పటానికి రెండడుగులు వేసాడో లేదో కుక్క తలెత్తి మొరిగింది కోపంగా! కాళ్ళు తడబడి వచ్చి మంచం మీద పడ్డాడు వేణు! భిక్షాలు చికాకుగా కళ్ళు తెరచి, దొంగ చూపులు చూస్తున్న వేణుని అనుమానంగా చూసి, "ఏమిటి?" అని అడిగాడు కర్కశంగా.

"కు.....క్క!"

"అదే! ఎందుకు అరుస్తోంది?"

"ఏమో నాకు తెలియదు! ఆ కుక్క నాదిగాదు!"

"ఏమిటా సమాధానాలు! ఏం చేశావ్ కుక్కని!"

"నేనేం చెయ్యిందే! లైటు ఆర్పుదామని వెళ్తుంటే...."

"అసలు నీకు ఆ లైటుతో ఏం పని?"

"లైటుంటే నిద్రపట్టదు!"

"లేకపోతే నాకు నిద్రపట్టదు తెలిసిందా! ఏమన్నా పనుంటే నన్ను పిలు! అంతే! లేదా ఈ కుక్క ఎముకలు కనపడకుండా నమిలేస్తుంది. నీ యిష్టం!"

వేణుకు భిక్షాలు యముడిలా కనపడ్డాడు. తను వచ్చిన పని నెరవేరేదెల్లాగా అన్న అలోచన పడ్డది. పైనుంచి, మాటలు అస్పష్టంగా వినపడుతున్నయ్! బయట వాన రొద యింకా సాగుతూనే వుంది. వేణుకు ఏం పాలుపోలా! వేణుకు భారతీ, వాళ్ళ నాన్న మాట్లాడుకుండే మాటలు విందామని వుంది. కానీ ఎలా? ఎదురుగా కుక్క! ఆ వెనుక భిక్షాలు!

బలవంతాన కళ్ళు మూసుకు పడుకున్నాడు వేణు! అయినా, ఏదో ఆశ అతన్ని అంటిపెట్టుకునే వుంది. చావును దగ్గరకు రానీయటంలా!

భిక్షాలు మళ్ళీ నిద్ర కుపక్రమించి మాంచి లోతులో వున్నాడు. అందమైన రంభ లాంటి స్త్రీ, అప్పుడే రంగంలోకి ప్రవేశించింది. భిక్షాలు ప్రాణం జివ్వుమని లాగుతోంది. రంభను ఒక్కసారి.... గట్టిగా.... పట్టుకోవాలని! కాని గుండె ధైర్యం చాలటంలా! గుండె చిక్కబట్టుకుని, రంభ దగ్గరకు వెళ్ళేసరికి, రంభ మాయమైంది చింతాలు లాగ.

చింతాలు భిక్షాలు భార్య! అట్టే రోజులు భిక్షాలుతో కాపురం చెయ్యకుండానే రోజులు ముంచుకొచ్చి - కుర్రాడితో లేచిపోయింది. భిక్షాలు చాలా బాధపడ్డాడు అది అన్న మాట లకు! వాళ్ళు వున్నచోటికి వెళ్ళి, 'యింటికిరా పోదాం' అన్నాడు భిక్షాలు! రానంది. అని అంతటితో వూరుకోక, "నీకు మగతనం లేదు! నువ్వు మొగాడివే కాదు! నాప వెధవ్వు" అని నానా జాతి కూతలు వడ్డించింది అయినా అన్నీ సహించి వూరుకున్నా చింతాలు రాలా! "నా గతెల్లా ఆడదాని తోడు లేకుండా ఎల్లా బ్రతికేది" అని వాపొయ్యాడు. "యేడన్నా అంట్లు తోము యింత కబళం ఏత్తారు నీ మొగాన! నాకు నా మొగుడు సర్వారావె - నువ్వు గాదు!" అనంది. ఎంతయినా పుట్టింది మొగపుట్టగ్గా మరి. పళ్ళు కటకట నమిలి గ్రుడ్లురిమి "ఆయ్ భాడ్కో, చూస్కో నిన్ను...." అని చిచింద్రీలా పేలాడు.

మరోసారి మంచం దిగబోయిన వేణు ప్రాణం చచ్చి, హతాశుడై వెనక్కు వాలాడు. కేకలు విని, భారతి గది బయటకు వచ్చి చూసింది. మళ్ళీ లోపలకు వెళ్తూవుంటే సీతా పతిగారు వచ్చారు.

"భిక్షాలు కలవరిస్తున్నాడు!"

ఆ తర్వాత వేణు స్థిమితంగా కళ్ళు మూసుకున్నాడు.

"వేణు నిద్రపోయినాడా?"

"ఆ! ఒకసారి వెళ్లి చూద్దామా నాన్నా!"

భారతి ప్రశ్నకు సీతాపతిగారు క్షణం యోచించి, "నీ మాట కాదనటమెందుకు పద!" అని భారతిని వెంబడించారు.

యిద్దరూ సరాసరి వచ్చి వేణు మంచం దగ్గర నిలబడ్డారు. వేణు అంతా గమనిస్తూనే వున్నాడు.

"చూడు నాన్నా! శాంతి పిన్ని పోలికలు లెవ్వూ?" అని తండ్రి మొహంలోకి చూసింది భారతి!

"కాదనను. కానీ మనం చూసే దృష్టిలో వుందమ్మా" సీతాపతిగారు దీర్ఘంగా నిట్టూర్చారు.

"కాదు నాన్నా! నాకెందుకో బలమైన నమ్మకం కలుగుతోంది. నాన్నా!" అని ఆగి, "పోనీ వేణుని లేపి, అడుగుదామా?" అనంది భారతి.

"ఏమని అడుగుతావు? నువ్వు మా తమ్ముడివేనా అడుగుతావా?"

ఆ హేళనకు భారతి, బాధ పడ్డది.

"కాదు నాన్నా! మనం మన తమ్ముడిని వెతుక్కోవటంలో తప్పేముంది? అది మన బాధ్యత గూడా!.... కాదంటావా?"

భారతి ఆవేశానికి సీతాపతిగారు ఆశ్చర్యం కనబరిచారు.

"నాన్నా! ఒక్కటడుగుతాను చెప్పు! శాంతి పిన్ని విషయంలో నువ్వెందుకు ముభావంగా వూరుకుంటున్నావో నాకు తెలియదు. ఆమెకు స్వయంగా హాని చేసి, కనీసం ఆ అపకారాన్ని మాపుకోటానికి నువ్వెందుకు ప్రయత్నించవు?"

"నా మనసు అర్థం చేసుకోవటం ఎవరికీ సాధ్యమవటంలేదు భారతీ. అంతే! ఎప్పుడో అంతా నీకు చెబుతాను" - సీతాపతిగారు భారంగా అడుగులేస్తూ మేడ మీద కెళ్ళారు.

ఆయన వెళ్ళిం తరువాత భారతి మేడ మీది కెళ్ళింది. వేణు అంతా వెళ్ళారని గ్రహించి తలెత్తి చూశాడు.

భిక్షాలుకు మెలకువ వచ్చి "యింకా నిద్రపోలా!" అని ఆవలించి చిటికేసి, "నిన్ను కనిపెట్టే వుంటున్నాలే?" అని బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాడు.

వేణు మంచం దిగి వెళ్ళి భిక్షాలు దగ్గర కూర్చున్నాడు. అడగనా, వద్దా అని భిక్షాలు గడ్డంలోకి చూశాడు.

"శాంతి పిన్ని అంటే ఎవరూ?"

భిక్షాలు విచిత్రంగా చూసి, "నీకెందుకు?" అని అడిగాడు.

"భారతి అక్కగారు అంటుంటే ఎవరో అని అడిగానంతే!"

"సరే అయితే కూర్చో! ఎలాగూ ఈ రోజు జాగారమే!" అని బాసిపట్లు వేసుకుని చెప్పటం ప్రారంభించాడు.

"సీతాపతిగారంటే చూశావుగా - ఆయనకు భారతి, కృష్ణమూర్తి యిద్దరు పిల్లలు. సీతాపతిగారి భార్య కాలం చేసింది, నా పెళ్ళికే. అంటే భారతి కింకా పెళ్ళిగాలా! నే ఊహ తెలిసిన దగ్గర్నుంచి ఈ యింట్లోనేలే ఉద్యోగం. యిహపోతే భారతమ్మగారి పెళ్ళయి అత్తగారింటి కెళ్ళాక అయ్యగారు శాంతమ్మ అనే అవిడ్ని మారుమనువు చేసుకున్నారు. అప్పటికి నా పెళ్ళయి పోయి సంవత్సరం అన్నమాట."

"చచ్చిపోయిందా?"

"ఛ హె, తప్పుడు కూత కూస్తావ్?"

"మరేమైంది?"

"ఏదో అయింది. నీ కెందుకు విను, అదేమో కృష్ణమూర్తిగారి కిష్టంలేదు. దాంతో యుద్ధం ప్రారంభమైంది. పెళ్ళయ్యేప్పటికి శాంతమ్మగారు గర్భిణితో వుంది. ఆవిడ నీళ్ళోసుగునే వేళకు కృష్ణమూర్తిగారు కొంత డబ్బు ఆశ చూపి భయపెట్టి, శాంతమ్మగార్నీ, ఆ పసిబిడ్డని దేశాల మీదకు తరిమేశారు."

"ఎన్నాళ్ళ క్రితం యిది జరిగింది!"

"సుమారు పదేనేళ్ళుపై మాటే! ఆ యమ్మ మా మంచిది."

"భారతమ్మగారి కంటేనా?"

"ఎవరికివారే మంచి! పాపం భారతమ్మగార్ని సూస్తేనే కడుపు తరుక్కుపోతుంది?"

"ఏం?"

"ఆయమ్మగార్ని చేసుకున్నాయన, మధ్యలో ఓ పిల్లాడు పుట్టినాక యింకెవర్నో తగు ల్కొని, ఈమెకు విడాకులిచ్చాడు. ఆ పిల్లాడు ఆడుకోటానికి ఎళ్ళి మళ్ళీ రాలా చచ్చిగానీ అప్పట్నుంచీ, ఆయమ్మ బ్రతుకు చీకటైంది! సర్లేపోయి పడుకో."

వేణు లేచి మంచం దగ్గరకు వెళ్ళాడు, భిక్షాలు పడుకోబొయ్యేంతలో, కారు హారనూ, కారు లైట్ల కాంతీ దూసుకొచ్చినయ్ లోపలకు. భిక్షాలు సస్తాయించి వూరుకునే వాడుగాని-

"ఒరేయ్! భిక్షాలూ అన్నయ్య వచ్చాడల్లేవుంది తలుపు తెరు!" అన్న భారతి మాటల్తో లేచి వెళ్ళక తప్పింది గాదు.

వేణుని చూసి, "వేణూ! పైకొచ్చెయ్ పనుంది!" అనంది. కృష్ణమూర్తి లోపలకు వెళ్ళటం, వేణు పైకి వెళ్ళటం ఒక్కసారే జరిగాయి.

వేణూని గది లోపలకు తీసికెళ్ళి, "కాసేపు ఇక్కడే వుండు అన్నయ్య నిద్ర పోయిం దాకా!" అని తలుపు దగ్గరేసి బయట కెళ్ళింది. వేణు కిందులో అంతర్యం అర్థంగాలా! కాసేపటికి కృష్ణమూర్తిగారి మాటలు, భిక్షాలు గొంతు వినపడ్డాయి? అంతే! ఆ తర్వాత

చాలాసేపటికి భారతి మాటలు వినిపించాయి.

"నిద్రపోలేదా నాన్నా!"

"లేదమ్మా లోపలకు రా! మనసెందుకో బాగాలేదు."

"ఇవాళ ఎందుకో భయం కలుగుతోంది! ఈ వాన ఒకటి బాగా? మన హృదయాల్లో మాదిరే ప్రపంచపు హృదయంలో గూడ గాలివాన చెలరేగటం చిత్రంగా లేదూ?"

"నిజం భారతీ! మన బ్రతుకులే అట్టి విచిత్రం. ఒక కథ చెబుతా విను! మధ్యలో ప్రశ్నలెయ్యకు!

"మన భూమంతా ఏ వూళ్ళో వుందో నీకు తెలుసు. దాన్ని తరతరాల నుంచీ చేస్తున్నది భూషయ్యగారి కుటుంబం. ఆయనకు మన భూమే జీవనం. ఆయనకు యిద్దరు కొడుకులు, ఒక్కతే ఆడపిల్ల! చాలా గౌరవమైన కుటుంబం. భూషయ్య చాలా పెద్ద మనిషి. ఎక్కడ కాలు జారిందోగానీ పెళ్ళిగాని భూషయ్య కూతురు, తప్పటడుగు వేసింది. ఈ సంగతి, బయటకు పొక్కక మునుపే, జాగ్రత్త పడాలనుకుంటే, ఆ అమ్మాయి ఒప్పుకోలా! కారణం ఏదైతే ఏం? ఆ అమ్మాయినలా వుంచటం కుటుంబంలో ఎవరికీ యిష్టం లేదు. ఆ రాత్రి నేను అక్కడ వున్నాను. అర్ధరాత్రి భయంతో ఆ అమ్మాయి ఆక్రందన, భూషయ్య నిస్సహాయతా, అన్నల గద్దింపు, వదినెల సాధింపు వినిపించినయ్! ఆ అమ్మాయి, నా పాదాల మ్రోల పడి రక్షించమని వేడుకుంది దీనంగా! అభయమిచ్చాను. కానీ దిక్కూ, దరీ తోచలా! కానీ మాట కోసం అబద్ధమాడి యిల్లాలుగా మీకు చెప్పాను...."

"అయితే ఆ అమ్మాయి శాంతా!??!" భారతి మొహంలో ఆశ్చర్యం, అగమ్యత, సంభ్రమం కలిగాయి! కానీ నమ్మలా! అలాగని నమ్మకుండా వుండనూ లేకపోయింది.

"అవును శాంతే!"

"మరి ఇంతకాలం నాకెందుకు చెప్పలా?"

"నువ్వేం చేస్తావ్! చెప్పిన కొడుకు శాంతను వెళ్లగొట్టాడు. తెలిసి నేను, తెలియక నువ్వూ చెయ్యగలిగిందేమీ లేదు" - సీతాపతిగారి మాటల్లో దిగులు, విచారం ద్యోతకమైనాయి.

"అన్నయ్యతో నిజం చెప్పేవా?"

"ఆహా, నిజం చెప్పడం వల్లనే శాంత కిక్కడ నుంచి బహిష్కరణ జరిగింది."

వేణు కళ్ళు ఆశ్చర్యంతో విప్పారాయి. గడియారం ఒంటి గంట కొట్టింది. కూర్చున్న చోటినుంచి లేవబోయినాడు. మాటలు వినపడ్డయ్!

"నిజం ఏమని చెప్పావు?"

"వాడు చేసిన తప్పు చెప్పాను."

"శాంతను పంపడంలోనేనా వాడి తప్పు?"

"కాదు!"

"మరి?"

"శాంత బ్రతుకు బండలు చేశాడు!"

"నిజంగానా?"

"ఆ! నిజం! అడపా దడపా ఆ ఊరెళ్ళి ఈ ఘనకార్యం చేశాడు."

"ఈ సంగతి నీకెలా తెలుసు?"

"శాంత చెప్పింది. కానీ తనకై తాను చెప్పలా! అమె నట్టి దురవస్థల పాలు చేసిన దుష్టుడి పేరు చెప్పమన్నా, నా చేయదగ్గ సహాయం చేస్తానని గూడ మాట యిచ్చాను!"

భారతికి నోట మాట రాలా! సీతాపతిగారు నిరామయంగా చూస్తూ కూర్చున్నారు చాలాసేపు!

"వేణు ఏం చేస్తున్నాడు?"

భారతేమీ సమాధానం చెప్పలేదు. వేణు మొహంలో సంతోషం మెదిలింది. ఆవెను వెంటనే నిస్పృహ కలిగింది. వెంటనే ఓ ఆలోచన, కృత నిశ్చయమూ కలిగింది. లేచి వెళ్ళాడు.

భారతి కళ్ళు నిప్పుకణికల్లా వున్నాయి. తెల్లవార్లూ ఆలోచిస్తూనే వుంది. కృష్ణమూర్తిని తన అన్నయ్యని భావించటానిగ్గూడ ఆమెకు సిగ్గు వేస్తున్నది.

సీతాపతి మాటల్లో నిజమెంత వుందో తెలుసుకుందామన్న ఆలోచన కలిగింది. లేచి కృష్ణమూర్తి గది కెళ్తుంటే భిక్షాలు ఎదురైనాడు.

"అన్నయ్య నిద్ర లేచాడా?"

"యిప్పుడే లేచారు."

పోతున్న భిక్షాలును పిల్చి, "చూడు వేణుని పైకి తీసుకురా" అని చెప్పి. తలుపు త్రోసి లోపలకు చూసింది. కృష్ణమూర్తి కాళ్ళు టేబుల్ మీద వుంచి, సిగరెట్ త్రాగుతూ రేడియో వింటున్నాడు. తలుపు చప్పుడు విని, వాకిలి వేపు చూసి, "ఓ! నువ్వా భారతీ! రా!.... ఏం యిలా వచ్చావ్?" అడిగాడు.

భారతి మొహం చాలా సీరియస్‌గా వుండటం చూడలేదు మూర్తి.

"నీతో మాట్లాడాలి?"

"మాట్లాడు! ఏ విషయం గురించి?"

"నీ విషయం గురించే!"

నవ్వాడు లైట్‌గా, "ఎందుకు భారతీ నా గురించి బెంగ నీకు? నన్ను బాగు చెయ్యటం అసాధ్యం. నా కెప్పుడూ చెడిపోతున్నానన్న అనుమానం లేదు."

"అది గాదు..... శాంత అనే అమ్మాయి నీకు తెలుసు గదూ?"

దెబ్బతిన్న పులిలా చూసి, "ఎవరు చెప్పారు నీకు?"

"తెలుసుకున్నాను. అయినా నిప్పువొళ్ళో దాచుకుంటే, తెలియక పోదుగా!"

"భారతీ ఎవరు చెప్పారో ఈ సంగతి నాకు తెలియకపోదు. వాళ్ళని ఏం చెయ్యాలో గూడ నాకు తెలుసు. యిహ నువెళ్ళు."

"శాంత సంగతి చెప్పనే లేదు!"

"చెప్పను ముందు బయటకెళ్ళు!" కృష్ణమూర్తి మొహం కోపంతో జేవురించింది. గొంతు క్రింది నరాలు ఉబ్బినయ్!

భారతి మారు మాట్లాడకుండా బయటకొచ్చేసింది. సీతాపతిగారిని చూసి క్షణం బిత్తర పోయి, అవమాన భారంతో తలొంచుకుంది.

"ఎందుకమ్మా! వాడి సంగతి తెలిసి వాడి దగ్గరకెళ్ళటం?"

భారతి మాట్లాడకుండా వెళ్ళి, కిటికీ ప్రక్కన కుర్చీలో కూర్చుంది.

ఆమె మనస్సు సంక్షుభితమైంది.

భిక్షాలు వచ్చి, "ఆ అబ్బాయి కనపడలేదండి. ఎక్కడికెళ్ళాడో ఏమో!" అనన్నాడు.

భారతికి విసుగు, కోపం వచ్చాయి. "వెళ్ళు! ఎక్కడి కెల్తాడు? సరిగ్గా వెతుకు" అని కసురుకుంది.

భారతి అలా నిరామయంగా చాలాసేపు గడిపింది. బరువుగా బయల్పడే ఉచ్ఛ్వాస నిశ్వాసాలకు ఆమె రొమ్ములు ఎగసి పడసాగాయి! మొహం నల్లపడి పోయింది - ఏదో ఆలోచనతో, కోపంతో చికాకుతో!

అప్రయత్నంగా ఆమె చూపునో కాగితం ఆకర్షించింది. గాలికి ఎగిరిపోకుండా, దాని మీద బరువు పెట్టి వుంది.

భారతి లేచి వెళ్ళి ఆ కాగితం చూసింది.

"భారతి అత్తయ్యగారికి,

ఇప్పటికే నా గురించి తెలుసుకోనుంటారు. తల్లి లేదు.... తండ్రి వుండీ ఎవరో తెలియని నా బ్రతుకింతవరకూ కష్టంగానే గడిచింది. మా మావయ్యలకు నేనంటే పురుగు కన్న నీచమైన వాడిని. కుక్క కన్నా నీచంగా చూశారు. మా అమ్మమ్మకు, తాతయ్యకు నా మీద వల్లమాలిన అభిమానమూ, ప్రేమ. వాటిని చూపటం తప్ప మరేం చెయ్యలేరు. వాళ్ళు తరచూ వాళ్ళ మాటల వల్ల విని తెలుసుకున్న ఈ 'శాంతినివాసం'లో నాకు చోటు దొరక్కపోదన్న నమ్మకంతోనే వచ్చాను. కానీ ఈ 'అశాంతినిలయం'లో బ్రతకలేనని పించింది. అందుకే వెల్తున్నాను. ఎక్కడికో.... గమ్యం లేదు..... పరమేశ్వరుడే దిక్కు నాకు...."

శలవు

వేణు -

"నాన్నా!" అని గావుకేక పెట్టి లేవబోయి అడుగెయ్యలేక ఒళ్ళు తిరిగి పడిపోయింది భారతి.... సీతాపతిగారొచ్చేసరికే.... ●